క్లుప్తంగా

సేవలు అభినందనీయం



కొత్తపేటలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అముడా చైర్మన్ డేవిడ్‌రాజు

కొత్తపేట: రిడీమ్ ఇండియా మినిస్ట్రీ సంస్థ సేవా కార్యక్రమాలు అభినందనీయమని అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు అన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు రెవ డాక్టర్ మనోహర్ జేమ్స్ ఆర్థిక సాయంతో కోనసీమ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కొత్తపేట రీజినల్ చైర్మన్ వీడి డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రాన్ని గురువారం డేవిడ్‌రాజు ప్రారంభించారు. మినిస్ట్రీ ఏపీ కోఆర్డినేటర్ బి.డానియేలు, నియోజకవర్గ పాస్టర్స్ ఏపీసీ నాయకులు రాజేంద్రప్రసాద్, సత్యానందం, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మి చేలో మంటలు

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెంలో గురువారం అల్లూరి సూర్యనారాయణ రాజు కాలనీకి సమీపంలోని జమ్మి చేలో మంటలు చెలరేగాయి. దీనికి ఎండ కారణమని భావిస్తున్నారు. స్థానికులు వెంటనే రాజోలు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో స్టేషన్ ఇన్‌చార్జి ఆఫీసర్ బి.బాలకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

అంబాజీపేట: పాము కాటు వేయడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మాచవరం భరత్‌నగర్‌కు చెందిన యలమంచలి బాలయ్య (59) తన ఇంటి వద్ద ఆరుబయట ఉండగా పొడ పాము కాటు వేసింది. దాంతో బాలయ్య అక్కడికక్కడే కుప్పకూలిపోవడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ వచ్చేలోగా బాలయ్య మృతి చెందాడని బంధువులు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఊబలంక గ్రామం, రావులపాలెం డిగ్రీ కాలేజీ, అంకాలమ్మ గుడి ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు పాళ్లమ్మ జాతర

మామిడికుదురు: ఈదరాడ గ్రామ దేవత శ్రీపాళ్లమ్మ జాతర మహోత్సవం శుక్రవారం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ యెరుబండి శ్రీరామమూర్తి తెలిపారు. ఈ జాతర మహోత్సవాలు ఈ నెల 28వ తేదీ ఆదివారం వరకూ జరుగుతాయన్నారు. దీనిని పురస్కరించుకుని పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వైభవంగా సౌభాగ్య వ్రతం



సౌభాగ్య వ్రతం చేస్తున్న మహిళలు

అయినవిల్లి: నల్లచెరువు గ్రామంలోని వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో సౌభాగ్య వ్రతం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, యాగశాల కైంకర్యం, స్వామివారికి పూలంగి సేవ, సౌభాగ్యవ్రతం, మాంగళ్య పూజ జరిపారు. స్వామివారిని వివిధ పుష్పాలతో అలంకరించారు. హనుమంతుని ప్రత్యేక వాహనంపై ఉంచి ఊరేగించారు.

జనసేన అభ్యర్థి ప్రచారం

అంబాజీపేట: కముజువారిలంక, వక్కలంక, ఇరుసుమండ గ్రామాల్లో పి.గన్నవరం నియోజకవర్గ జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

వేసవిలో జాగ్రత్తలు అవసరం



పినపళ్లలో వడదెబ్బ లక్షణాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: వేసవి దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది గురువారం ఇంటింటికీ వెళ్లి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసి, ఎల్లప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈలు బి.సూర్యనారాయణ, ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

అన్ని వర్గాలూ ఆదరించడం అదృష్టం

ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి జగ్గిరెడ్డి



మడికిలో పార్టీలో చేరిన వారికి వైఎస్సార్ సీపీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



గోపాలపురంలో వానపల్లి నాయకులకు పార్టీ కండువాలు వేసిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: నియోజకవర్గంలో కుల, మత, వర్గాలకు అతీతంగా అందరూ తనను ఆదరించడం అదృష్టమని సిట్టింగ్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. వానపల్లిలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన బండారు రాము, బండారు పళ్లంరాజు, బండారు హరీష్ తదితరులు ఆయా పార్టీలకు రాజీనామా చేశారు. వానపల్లి వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దింశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారు గోపాలపురం వెళ్లి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి జగ్గిరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని, ఎవరి సిఫార్సులతో పనిలేకుండా సంక్షేమ పథకాలు అర్హులకు చేరాయన్నారు. రాష్ట్రానికి జగన్, నియోజకవర్గానికి జగ్గిరెడ్డి నాయకత్వం అవసరం ఉందన్నారు. వారి నాయకత్వంలో పనిచేసేందుకు వైఎస్సార్ సీపీలో చేరామన్నారు. జగ్గిరెడ్డి విజయానికి కృషి చేస్తామన్నారు.

పేదలకు అండగా సీఎం జగన్

ఆలమూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో పేద, మధ్యతరగతి ప్రజలకు సీఎం వైఎస్ జగన్ అనేక పథకాలు అమలు చేశారని, ఓటు అనే ఆయుధంతో తిరిగి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువస్తామని పలు గ్రామాల ప్రజలు నినదించారు. గురువారం మండలంలోని మడికి, చెముడులంక, గుమ్మిలేరు గ్రామాల్లో వందలాది మంది ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మడికిలో వైఎస్సార్ సీపీ నేతలు యనమదల నాగేశ్వరరావు, పడమట రాంబాబు, ఉండ్రాసపు చిన్న ఆధ్వర్యంలో ఎస్సీ, బీసీ ఏరియాలకు చెందిన సుమారు 150 మంది, గుమ్మిలేరులో సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కొత్తగా ఓటు హక్కు కలిగిన యువకులు, మహిళలతో పాటు చెముడులంకలో మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ప్రోత్సాహంతో నియోజకవర్గంలో సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన నయనాల శ్రీరాములు కుటుంబీకులు వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ మళ్లీ విజయం సాధించడం ఖాయమని, కార్యకర్తలందరికీ సముచిత స్థానం కల్పించి పేదలకు సేవ చేసే అవకాశాన్ని కల్పిస్తామని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి హామీ ఇచ్చారు. ఈ చేరికలతో వైఎస్సార్ సీపీ రోజు రోజుకూ మరింత పడుతోంది. సీఎం జగన్ మళ్లీ అధికారం చేపడితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమనే విశ్వాసంతో, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కార్యకర్తల పట్ల చూపుతున్న ఆదరణ, ఆప్యాయతలకు ఆకర్షితులైన వారు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని నాయకులు తెలిపారు.

ప్రచారంలో దూసుకుపోతూ..



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ దూసుకుపోతుంది. అన్నిచోట్లా ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది. ఆలమూరు మండలం గుమ్మిలేరు, మోదుకూరు, నర్సిపూడి గ్రామాల్లో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, సర్పంచ్‌లు గుణ్ణం రాంబాబు, పెంటపాటి శ్యామల, కందిబొట్ల శ్రీనివాసు, సీపీసీఎస్ మాజీ అధ్యక్షులు చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, నల్లి రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ మోసపూరిత వాగ్దానాలతో మళ్లీ టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలకు ముందుకు వస్తున్నాడన్నారు. గ్రామ వలంటీర్ల ద్వారా ఇంటింటికీ సంక్షేమాన్ని అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై కక్ష్యగట్టిన టీడీపీ నేతలు పింఛన్ లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేసే కార్యక్రమాన్ని అడ్డుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలతో ప్రజలను ఏవిధంగా ఇబ్బందులకు గురి చేశారో అందరికీ తెలుసన్నారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారం చేపడుతుందనే భావన ప్రజలు చూపిస్తున్న ఆదరణలో తేటతెల్లమవుతున్నారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, నామాల శ్రీనివాసు, ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి, నెక్కంటి వెంకట్రాయుడు, మోటుపల్లి వెంకన్న, దియ్యన పెదకాపు, ఆకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు ఫీజు రాయితీ



ఆలమూరు డిగ్రీ కళాశాలలో ప్రచార పత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024– 25 విద్యా సంవత్సరంలో చేరే తొలి 45 మంది విద్యార్థులకు ఫీజుల్లో పూర్తి రాయితీ కల్పిస్తున్నామని కళాశాల అభివృద్ధి కమిటీ, చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. గురువారం స్థానిక కళాశాల ఆవరణలో గురువారం విలేకరులతో వారు మాట్లాడుతూ బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపులకు 15 మంది చొప్పున తొలుత చేరబోయే మొత్తం 45 మంది విద్యార్థులకు ప్రథమ సంవత్సరానికి సంబంధించిన పూర్తి ఫీజును చెల్లించేందుకు కమిటీ నిర్ణయించిందన్నారు. మోదుకూరుకు చెందిన గుణ్ణం వీర్రాజు కళాశాల అభివృద్ధికి రూ 50 వేల విరాళాన్ని అందించారు. ప్రచార పత్రాల ముద్రణ అడ్వకేట్ ఎస్‌కే షరీఫ్ ఆర్థిక సాయం చేశారు. అనంతరం 2024– 25 సంవత్సరానికి సంబంధించిన కళాశాల ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. గారపాటి త్రిమూర్తులు, ప్రిన్సిపల్ వి.నరసింహస్వామి, ఎంఈఓ సుబ్బరాజు పాల్గొన్నారు.

చంద్రరావు మృతికి సంతాపం

అంబాజీపేట: మాచవరానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గ్రాప చంద్రరావు ఆకస్మిక మృతికి ఆ పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులను జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, అప్పన శ్రీను, కుసుమ శ్రీను తదితరులు పరామర్శించారు.

మలేరియాను తరిమికొడదాం



నగరంలో ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ ఉద్యోగులు

మామిడికుదురు: ప్రపంచ మలేరియా నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మలేరియాతో పాటు పలు వ్యాధుల వ్యాప్తికి ప్రధాన కారణమైన దోమల నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యంతో కృషి చేస్తామని పీహెచ్‌సీ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. మలేరియాను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. దోమల సంతానోత్పత్తి చేసే లార్వా ప్రదేశాలను సమూలంగా నిర్మూలించే కార్యక్రమం చేపడతామన్నారు. ర్యాలీలో పీహెచ్‌సీ ఉద్యోగులు, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కొత్తపేట: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అన్నారు. గురువారం స్థానిక కళాశాలలో జువాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలు శుభ్రంగా లేకపోతే దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారకమవుతుందన్నారు. జువాలజీ హెచ్‌ఓడీ బి.విజయకుమార్, అధ్యాపకులు ప్రసన్నజ్యోతి, వి.నాగదీపిక, సాయిలక్ష్మి, భవాని తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: స్థానిక పీహెచ్‌సీ వద్ద మలేరియా నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.రాజబాబు మాట్లాడుతూ మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా మలేరియాను నివారించవచ్చన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ పి.ప్రసాదరావు, పి.మోహన్‌వాణి, పీహెచ్‌ఎన్ డి.సీతారామమ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ స్వరాజ్యం

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు



వాకలగరువులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు

అంబాజీపేట: సీఎం జగన్ ప్రభుత్వంలో రాష్ట్రానికి సంక్షేమ స్వరాజ్యం వచ్చిందని, ఇది కొనసాగించేందుకు మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకుందామని పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు పిలుపునిచ్చారు. వాకలగరువు, తొండవరం, నందంపూడి గ్రామాల్లో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావును అడుగడుగునా పూలతో సత్కరించి, మహిళలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి, పేదలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కృషి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. ఐదేళ్ల జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికీ మేలు జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, అమలాపురం ఎంపీ అభ్యర్థిగా రాపాక వరప్రసాద్‌ను గెలిపించాలని వేణుగోపాలరావు కోరారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు, ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించాలన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, సర్పంచ్ పితాని మంగాదేవి, కొర్లపాటి కోటబాబు, వెన్నపు రాంబాబు, వాకపల్లి శ్రీనివాస్, కాండ్రేగుల నాగబాబు, మద్దింశెట్టి మల్లిబాబు, పితాని వీరాస్వామి, గోసంగి కుమారస్వామి, పెచ్చెట్టి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతో అర్హులందరికీ మేలు

ఎమ్మెల్సీలు గొల్ల బాబూరావు, కుడుపూడి సూర్యనారాయణ



మలికిపురంలో ఎమ్మెల్సీ బాబూరావును సత్కరిస్తున్న రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు



వీవీ మెరకలో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమంలో కిట్లు ఇస్తున్న గొల్లపల్లి

మలికిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని ఎమ్మెల్సీలు గొల్ల బాబూరావు, కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. గురువారం మలికిపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ పార్టీ కార్యవర్గ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. వైఎస్సార్ సీపీ రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలో అర్హులందరికీ పథకాలు అందాయన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అమ్మ ఒడి, సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, విద్యా దీవెన, వసతి దీవెన, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా, జగనన్న చేదోడు, జగనన్న తోడు, 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు పెద్ద ఎత్తున అందించారన్నారు. కల్యాణమస్తు, షాదీ తోఫా ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు జగనన్న ప్రభుత్వంలో మాత్రమే అమలు జరిగాయన్నారు. పాదయాత్ర సమయంలో ప్రజల కష్టాలను గుర్తించి జగన్ సీఎం కాగానే అందరికీ పథకాలు అమలు చేశారన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాల కంటే తక్కువ ధరలో నిత్యావసర వస్తువుల ధరలు ఇక్కడే ఉన్నాయని అన్నారు. చంద్రబాబు హయాంలో కంటే ఐదు రెట్లు అధికంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఉద్యోగాలు కల్పించారన్నారు. చంద్రబాబు, జగన్ పాలనలో వ్యత్యాసాలను గమనించేందుకు సమీపంలో ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, నాడు– నేడు కార్యక్రమం పేరిట మార్పు చెందిన ఆసుపత్రులు, పాఠశాలను ఒకసారి పరిశీలించి ఆలోచన చేయాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో ప్రజలకు ప్రయోజనం కలిగించేలా విప్లవాత్మక మార్పులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అడబాల వీర బ్రహ్మాజీరావు, కట్టా శ్రీనివాసరావు, కుసుమ చంద్రశేఖర్, బొలిశెట్టి భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి మద్దతు తెలపండి

సఖినేటిపల్లి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని ఆ పార్టీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. వీవీ మెరకలో గ్రామ శాఖ అధ్యక్షుడు కారుపర్తి భాస్కరరావు అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, బూత్ కోర్ కమిటీ సభ్యులతో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం పేరుతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిద్ధం కిట్లను పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎంగా మళ్లీ జగన్‌నే గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరిందన్న విషయాన్ని తెలిపాలన్నారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి నల్లి మోహన్ మాట్లాడుతూ బూత్‌ల పరిధిలో పార్టీకి ఓటింగ్ శాతం పెరిగేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, ఎంపీటీసీ గుబ్బల ఆంజనేయులు, నాయకులు ఇనుమర్తి వీర నాగరాజు, ఓగూరి బాబులు పాల్గొన్నారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం

ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్



ముమ్మిడివరప్పాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

రావులపాలెం: నమ్మించి మోసం చేయడం టీడీపీ అధినేత చంద్రబాబు నైజం అని, త్వరలో జరిగే ఎన్నికల్లో మాదిగలంతా జగనన్న గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడు మాదిగ పేటలో మాదిగల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. 2014 ఎన్నికల ముందు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న మాదిగలకు ఎమ్మెల్యే సీటు ఇస్తానని నమ్మించి చంద్రబాబు మోసం చేశాడన్నారు. అదేవిధంగా జనసేన నాయకుడు పవన్‌కల్యాణ్ 2019 ఎన్నికలలో మాదిగలకు పి.గన్నవరం సీటు ఇస్తానని ఇవ్వలేదన్నారు. మాదిగల ఓట్ల కోసం ఇప్పుడు మళ్లీ కల్లబొల్లి మాటలు చెబుతున్నారని అన్నారు. రాష్ట్ర చరిత్రలో మాదిగలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. జిల్లాలో మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించి ఎమ్మెల్సీ ఇచ్చి చట్టసభలకు పంపిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అందుకే మాదిగలు అంతా వైఎస్సార్ సీపీకి అండగా ఉండి మే 13న జరిగే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి కొత్తపేట అసెంబ్లీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం పార్లమెంట్ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. నాయకులు కొల్లి శ్యామ్, చదలాడ ఆనందరావు, చదలాడ మసేను, నేకూరి రాజేష్, మెరుగుపువ్వు భాస్కర్‌రావు, చదలాడ యాబేల్, ఉండ్రాజవరపు సీతారామయ్య, యార్లగడ్డ గణేష్, కాపా రాము, నేకూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ ఎన్నికల ప్రచారానికి ఏర్పాట్లు



హెలిప్యాడ్ ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న హరిప్రసాద్‌రెడ్డి

అంబాజీపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 29న అంబాజీపేటలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తారనే సమాచారంతో, ఆ ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యాలయ ప్రతినిధి హరిప్రసాద్‌రెడ్డితో పాటు పలువురు పరిశీలించారు. ఈ మేరకు గురువారం అంబాజీపేట సెంటర్‌ను పరిశీలించారు. సీఎం జగన్ పర్యటనకు సంబంధించి హెలిప్యాడ్ కోసం స్థానిక జెడ్పీ హైస్కూల్, జయంతి నగర్ వద్ద ఉన్న ఖాళీ స్థలాలను చూశారు. ఆ రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు సీఎం జగన్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని అన్నారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర నాయకుడు మంతెన రవిరాజు, జిల్లా నాయకులు దొమ్మేటి సత్యమోహన్, మట్టపర్తి యజ్ఞశ్రీ, దూనబోయిన రాంబాబు తదితరులు ఉన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం



నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు రాజేశ్వర్

పి.గన్నవరం: నామినేషన్ల పర్వంలో చివరి రోజైన గురువారం పి.గన్నవరం అసెంబ్లీ స్థానానికి ఏడుగురు అభ్యర్థులు 9 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు నామినేషన్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మూడు సెట్ల నామినేషన్ పత్రాలు, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నక్కా శేఖర్, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా గిడ్డి సత్యనారాయణ, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గిడ్డి సత్యనారాయణ, స్వతంత్రులుగా గన్నవరపు చంద్ర ఆనంద్, నాగాబత్తుల హేమంత్ కుమార్‌లు ఒక్కొక్క సెట్ చొప్పున నామినేషన్లు వేశారు. చివరిరోజు నామినేషన్ల ప్రక్రియను ఎన్నికల పరిశీలకుడు రాజేశ్వర్ గోయల్ పరిశీలించారు.

కొత్తపేట: కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గానికి 18 మంది నామినేషన్లు దాఖలు చేసినట్టు స్థానిక ఆర్‌డీఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి జీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఇందులో వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా చిర్ల జగ్గిరెడ్డి, చిర్ల లావణ్య (లక్ష్మీకోటేశ్వరి), బీఎస్పీ తరఫున కాండ్రు వెంకటేశ్వరరావు, టీడీపీ నుంచి సత్యానందరావు బండారు, బండారు కమలారాణి, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నుంచి దడాల చంద్రరావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఈశ్వరరావు రౌతు, కాశీవిశ్వనాథం రౌతు, జై భారత్ నేషనల్ పార్టీ తరఫున సత్యాల అరుణకిరణ్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున బండారు శ్రీనివాసరావు, స్వతంత్రులుగా రాయుడు రాజు, ఇమ్మానుయేలు కుమార్ ఇసుకపట్ల, సుధాకర్ అంబరుఖాన, నల్లమిల్లి జ్యోతిరెడ్డి, బొచ్చ శ్రీనివాసరావు, సలాది వీరవెంకట దుర్గ సత్యనారాయణమూర్తి, సుంకర లక్ష్మీమణికుమారి, మెర్ల శాస్త్రులు నామినేషన్లు దాఖలు చేసినట్టు ఆర్‌ఓ తెలిపారు.

విద్యార్థినులకు అభినందన



సత్కారం పొందిన విద్యార్థినులతో బోధన సిబ్బంది

సఖినేటిపల్లి: పదో తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను మండల యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. సఖినేటిపల్లి గీతా మందిరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అభినందన సమావేశంలో మండల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన నేహశ్రీ, జగతి, దేవీలను బోధన సిబ్బంది అభినందించారు. యూటీఎఫ్ తరఫున ఒక్కో విద్యార్థినికి రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతిని, షీల్డ్‌లను అందించారు. ఎంఈవో-2 మద్దాలి వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లి విశ్వనాథం, హెచ్‌ఎంలు కె.వీరాస్వామి, ఎస్.శ్రీధర్‌కృష్ణ, యూటీఎఫ్ అధ్యక్షుడు జి.రాజబాబు, గౌరవ అధ్యక్షుడు ఎస్.శామ్యూల్‌రాజు, ప్రధాన కార్యదర్శి కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



సీజ్ చేసిన రూ.4.5 లక్షల నగదుతో ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు

మామిడికుదురు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో డబ్బు పంపిణీ, మద్యం సరఫరాను నివారించేందుకు ఎన్నికల కమిషన్ పక్కా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా మండల పరిషత్ ఉద్యోగులు, పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్నారు. పాశర్లపూడిబాడవలో గురువారం నగరం ఎస్సై పి.సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. 216వ నంబర్ జాతీయ రహదారిపై వెళ్తున్న ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డబ్బు, మద్యం తరలించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ హెచ్చరించారు.

రూ.4.5 లక్షల స్వాధీనం

అయినవిల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహిస్తుండగా, ముక్తేశ్వరం ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో రూ.4.5 లక్షలు పట్టుబడింది. ఈ సొమ్ము కపిలేశ్వరపురం మండలానికి చెందిన చిటికిన వెంకటేశ్వరరావు మోటార్ సైకిల్‌పై తరలిస్తుండగా పట్టుకున్నారు. అతను సరైన రికార్డులు చూపకపోవడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృంద సభ్యులు ఎం.విజయలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ వి.శ్రీనివాసరావులు ఆ సొమ్ము సీజ్ చేసి పి.గన్నవరం ఆర్వోకు అప్పగించారు. వీరి వెంట ఎస్సై బి.రాజేష్‌కుమార్ ఉన్నారు.